క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పుష్పాలంకరణ



ముత్తుకూరు: స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పల్లకిసేవ నిర్వహించారు. తొలుత ఆంజనేయస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తగా గౌడ సంఘం వ్యవహరించింది.

వినాయక స్వామికి విశేష పూజలు



మనుబోలు: మండలంలోని కొండూరుసత్రంలోని వినాయక స్వామి ఆలయంలో బుధవారం పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. వినాయకుడు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పసుపులేటి శ్రీనివాసులు, రమాదేవి దంపతులు వ్యవహరించారు.

కేన్సర్ నియంత్రణకు కృషి



నెల్లూరు(అర్బన్): ముందుగా గుర్తించడం ద్వారా కేన్సర్‌ను నయం చేయొచ్చని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి) సూపరింటెండెంట్ సిద్ధానాయక్ పేర్కొన్నారు. కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం కోసం కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. ప్రస్తుతం రెండో దశలో జిల్లా స్థాయిలోని సెకండరీ హెల్త్ స్పెషలిస్ట్ డెంటల్ డాక్టర్లు, గైనకాలజిస్ట్‌లకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. పీహెచ్‌సీ డాక్టర్లు, ఎమ్మెల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలకు మూడో దశలో శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. పరీక్షల్లో గుర్తించిన కేన్సర్ బాధితులను రోగ నిర్ధారణ కోసం మెడికల్ కళాశాలకు పంపి.. అవసరమైన వారికి చికిత్సను అందించనున్నామని వెల్లడించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి రమేష్‌నాథ్, ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, ఎన్సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, డాక్టర్లు చంద్రశేఖర్, కాలేషాబాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వసంతోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వసంతోత్సవాలు బుధవారంతో ముగిశాయి. నవకలశ స్నపన తిరుమంజనం, వసంతోత్సవం, దివ్యప్రబంధగోష్ఠి, ఆస్థాన సేవ తదితరాలను నిర్వహించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

యథేచ్ఛగా ఆక్రమించి.. నిర్మించి

పంటల కాలువపై భవన నిర్మాణం

- ఆక్రమణదారులు ప్రభుత్వ ఉద్యోగులు
- బీజేపీలో క్రియాశీలకంగా ఉన్న వైనం

ఎన్నికల హడావుడిలో అధికారులు తలమునకలై ఉన్న సమయంలో ఇదే అదునుగా ఆక్రమణదారులు పంట కాలువలపై పక్కా భవనాలు నిర్మించుకుంటున్నారు. కేవలం రాత్రి సమయాల్లోనే భవన నిర్మాణ పనులు చేస్తూ పగటిపూట తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు.

ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణ నడిబొడ్డున సర్వే నంబర్ 972/ఏ లో పూర్తిగా నీటిపారుదల శాఖకు చెందిన కాలువ భూమి ఉంది. ఆ కాలువ ద్వారా ఎల్‌ఆర్‌పల్లి, జేఆర్‌పేట శివార్లలో ఉన్న భూములకు నీటిపారుదల జరుగుతుంది. అయితే రెండు నెలల క్రితం సోమశిల రోడ్డు మలుపు వద్ద ఆ కాలువపై చిన్నపాటి బడ్డీ దుకాణాలు, రేకుల రూములకు వెనుక వైపు ప్రస్తుతం కాలువపై పక్కాగా స్లాబు పోసి దానిపై వ్యాపార గదుల నిర్మాణాలను మొదలుపెట్టారు. అప్పట్లో దీనిపై ఫిర్యాదులు అందడం, పత్రికల్లో కథనాలు రావడంతో వ్యవహారం సర్దుమణిగింది. అయితే ఈ నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు కావడం గమనార్హం. వారిలో ఓ వ్యక్తి ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ, మరో వైపు భారతీయ జనతా పార్టీ కార్యకలాపాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తుండడం విశేషం. అయితే వీరి అక్రమ నిర్మాణాలను అటు రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో పాటు ఇటు నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఖరీదైన స్థలంలో..

పట్టణ నడిబొడ్డున, మెయిన్ బజారులో నిర్మిస్తున్న ఆక్రమణ స్థలం విలువ రూ.కోట్లలో ఉంటుంది. మెయిన్ స్థలంలో ఆక్రమణ జరుగుతున్నా.. అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం విచిత్రం. గతంలో ఈ ప్రాంతంలో కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కుటుంబ పోషణ కోసం వ్యాపారాలు చేసుకుంటుండడంతో అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించారు. అయితే దీనినే అదునుగా చేసుకుని ఇరిగేషన్ శాఖకు చెందిన పంట కాలువపై భవనాలు నిర్మిస్తున్న ఇరువురు ప్రభుత్వ ఉద్యోగులపై ఎలాంటి విచారణ.. పరిశీలన.. లేకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాంతంలో అంకణం భూమి విలువ రూ.2 లక్షలకుపైగా ఉంది. వ్యాపార కేంద్రం కావడంతో డిమాండ్ ఎక్కువ. కాలువపై సుమారు ఒక్కొక్కరు పది అంకణాలకు పైగా ఆక్రమించి భవనాలు నిర్మించారు. కాగా ప్రస్తుతం ఏకంగా మూడు అంతస్తుల భవనాలు నిర్మించి వేలాది రూపాయలకు అద్దెకు ఇచ్చి కొందరు అప్పనంగా ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నారు.



ఆత్మకూరు నడిబొడ్డున సోమశిల రోడ్డు సెంటర్ వద్ద నిర్మిస్తున్న మూడు అంతస్తుల భవనం



రాత్రి సమయాల్లో మాత్రమే జరుగుతున్న నిర్మాణం

దీని విషయమై ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఈ భూమి తమకు సంబంధం లేదని చెప్పడం గమనార్హం. జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇంతకాలం ఎన్నికల కోడ్, ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నామని అధికారులు కుంటి సాకులు చెప్పుకుంటూ వచ్చారు. ఈనెల 6వ తేదీకి కోడ్ ఎత్తివేస్తుండడంతో అధికారులు చర్యలు తీసుకుంటారా.. లేదా ? అనేది చూడాలి.

కొనలేం.. తినలేం..



మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన కూరగాయలు

- మండిపోతున్న కూరగాయల ధరలు

సీతారామపురం : ఏం కొనేలా లేదు.. ఏం తినేలా లేదు అన్నచందంగా మారింది సామాన్యుల పరిస్థితి. మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. గత నెలలో ఉన్న ధరలకు ఇప్పుడు రెండింతలు పెరగడంతో సామాన్య ప్రజలు కూరగాయలు కొనాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఐదుగురున్న కుటుంబంలో ఒక్కరోజు కూరగాయలకు దాదాపు రూ.100 ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. మామూలు రోజుల్లో పచ్చిమిర్చి కేజీ ధర రూ.25 నుంచి 40 మధ్య ఉండేది. టమోటా ధర కూడా రూ.20 పలికేది. కానీ ప్రస్తుతం దిగుబడులు తగ్గి డిమాండ్ పెరగడంతో వ్యాపారులు ధరలను పెంచేశారు. పచ్చిమిర్చి కిలో రూ.140, టమోటా రూ.50, బీన్స్ రూ.150, క్యారెట్ రూ.100, దొండ, బెండకాయలు రూ.100 వంతున ధర పలుకుతోంది. ఎండలు ఎక్కువగా ఉండడం, సాగునీరు లేకపోవడం తదితర కారణాలతో రైతులు కూరగాయలను పండించడం లేదు. దీంతో మరో నెలరోజుల పాటు కూరగాయల ధరలు మండిపోయే అవకాశం ఉంది.

17 నుంచి సంతానలక్ష్మి బ్రహ్మోత్సవాలు

ఉదయగిరి : ఉదయగిరి పట్టణంలో కొలువైన సంతానలక్ష్మి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ హోమాలు, కలశస్థాపన, అంకురారోహణ ఉంటుందని, 18న విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు, కుంకుమార్చన, 19న విశేషాలంకరణ, పసుపు, కుంకుమ పూజలు, సంతానం లేని వారు వరపడుట, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం, 20న శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం, ప్రత్యేక పూజలు, 21న అమ్మవారికి ధనలక్ష్మి అలంకరణ, బండ్లు పొంగళ్ల కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.



సంతానలక్ష్మి అమ్మవారు

పనికి తగ్గ కూలి వచ్చేలా చూడాలి



మాట్లాడుతున్న ఏపీఓ వెంకటనారాయణ

- ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏపీఓ సమావేశం

మర్రిపాడు : ఉపాధి హామీ పథకం కింద పేదలకు పనికి తగ్గ కూలి వచ్చేలా చూడాలని ఏపీఓ వెంకటనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని ఎన్ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏపీఓ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 24 పంచాయతీల్లో ఎన్ఆర్‌ఈజీఎస్ పనులు చేపట్టాలని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పనులు కల్పించాలన్నారు. పనిచేసే ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ తదితర మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. అలాగే ఏదైనా అనుకోకుండా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స కోసం కిట్‌లను కూడా అందుబాటులో ఉంచుతామని వివరించారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



ఉదయగిరి : మొక్కలు నాటుతున్న సిబ్బంది

ఉదయగిరి : ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడుకుంటూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని కృష్ణంపల్లి అటవీ శాఖ ఎఫ్ఎస్ఓ షేక్.మునీర్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉదయగిరి అటవీ రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని వెంగళరావునగర్ గ్రామ సచివాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన బుధవారం మొక్కలు నాటారు. అలాగే ప్రకృతికి హాని కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ మొండ్రు తిరుపతయ్య, ఎఫ్‌బీఓలు కరిముల్లా, అఫ్జల్, వైద్యారోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

కలిగిరి : మొక్కలను పెంచడం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంపీడీఓ రంగ సుబ్బరాయుడు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కలిగిరిలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తప్పనిసరిగా కనీసం ఒక్క మొక్కను నాటలనే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కె.శ్రీనివాసరావు, ఏపీఎం సుజాత, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



కలిగిరిలో మొక్కలు నాటుతున్న అధికారులు

జాతీయ స్కాలర్‌షిప్‌కు మోడల్ స్కూల్ విద్యార్థినులు



మధుప్రియ | లక్ష్మీపూజిత | షేక్.అఫ్రీన్

దుత్తలూరు : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దుత్తలూరు ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జె.సైమన్‌రావు తెలిపారు. 8వ తరగతి చదువుతున్న జి.మధుప్రియ, బి.లక్ష్మీపూజిత, షేక్.అఫ్రీన్ ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చాటి స్కాలర్‌షిప్‌కు అర్హత పొందారని తెలియజేశారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థినులను అభినందించారు.

గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం



సంగం : సంగం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను ఏర్పాటు చేశారు. విశ్రాంతి సమయంలో విద్యార్థులకు స్నాక్స్ అందించారు. స్పోకన్ ఇంగ్లిష్, గణితంలో సహజ సంఖ్యలు, రోమన్ సంఖ్యల గురించి వివరించారు. అనంతరం గ్రంథాలయాల ఏర్పాటు కోసం కృషి చేసిన వారి గురించి విద్యార్థులకు వివరించారు.

స్వచ్ఛతే లక్ష్యంగా..

- నగరంలో అధునాతన మరుగుదొడ్లు
- రూ.5.5 కోట్లతో ఏర్పాటు
- మొత్తం 62 టాయ్‌లెట్ల నిర్మాణం
- నూతనంగా నిర్మించినవి 18..

ఆధునికీకరించినవి 28





ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో అధునాతనంగా నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్

నెల్లూరు(బారకాసు): బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిర్మూలన దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపట్టాయి. దీనికి సంబంధించి స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఇప్పటికే పలు అంశాలకు శ్రీకారం చుట్టారు. తాజాగా పట్టణాలు, నగరాల్లో ప్రజా మరుగుదొడ్ల నిర్మాణాలకు ఉపక్రమించారు.

విరివిగా నిర్మాణం

నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. షాపింగ్ మాళ్లు.. పెద్ద భవనాలు.. భారీ భవంతులు దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ఖాళీ స్థలమే కరువైంది. ఈ క్రమంలో జిల్లా నలుమూలల నుంచి వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చే వారు మల, మూత్ర విసర్జనకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ తరుణంలో సమస్య పరిష్కారానికి నెల్లూరు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. నగరంలో జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి పబ్లిక్ టాయ్‌లెట్లను నిర్మించారు. కమ్యూనిటీ టాయ్‌లెట్లు గతంలో కొన్ని ఉండగా, ప్రస్తుతం వీటికి అదనంగా మరికొన్నింటిని ఏర్పాటు చేశారు.

పలు సంస్థల నిర్వహణ

పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్వహణను పలు సంస్థలకు ఉచితంగా అప్పగించారు. ముంబైకి చెందిన సులభ్ కాంప్లెక్స్, హైదరాబాద్‌కు చెందిన దుర్గా సేవా సమితి, గుంటూరుకు చెందిన సులభ్ ఇంటర్నేషనల్ సంస్థలు వీటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతున్నాయి. సేవలను వినియోగించుకునేందుకు కొంత రుసుమును వసూలు చేస్తున్నారు. నగరపాలక సంస్థ చర్యలపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

500 మీటర్లకో టాయ్‌లెట్

నగరపాలక సంస్థ పరిధిలో 62 పబ్లిక్ టాయ్‌లెట్లు ఉన్నాయి. రూ.5.5 కోట్లతో కొన్నింటిని నూతనంగా నిర్మించగా, మరికొన్నింటికి మరమ్మతులు చేసి అధునాతనంగా తీర్చిదిద్దారు. ఒక్కోదానికి సుమారు రూ.10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వెచ్చించారు. ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి వరకు ప్రధాన రహదారిపై, నర్తకి సెంటర్, సంతపేట, ములుమూడి బస్టాండ్, తడికలబజార్, గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని గాంధీపార్కు పక్కన, సాయిబాబా మందిర వీధిలో, పొదలకూరు రోడ్డు సెంటర్, కొండాయపాళెం గేట్ సెంటర్.. ఇలా ప్రతి 500 కిలోమీటర్లకో టాయ్‌లెట్ చొప్పున నిర్మించారు. ఇందులో కొత్తవి 18 కాగా, ఆధునికీకరించినవి 28 ఉన్నాయి. వీటిలో నాలుగింటిని అధునాతనంగా తీర్చిదిద్దారు. గాలి, వెలుతురు, నీటి సౌకర్యం, విద్యుత్, తదితర సౌకర్యాలను కల్పించారు. దివ్యాంగులకు సైతం అనువుగా వీటిని ఏర్పాటు చేశారు.

ఏర్పాటు సంతోషకరం

నెల్లూరు నగరానికి తరచూ వస్తుంటాం. అత్యవసర సమయాల్లో మహిళలు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. నగరంలోని పలు ప్రాంతాల్లో అధునాతనంగా టాయ్‌లెట్లను నిర్మించడం చాలా సంతోషంగా ఉంది.

: లతారెడ్డి, ముత్తుకూరు

నిర్మాణం అభినందనీయం



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో మరుగుదొడ్లను నిర్మించారు. వీటిని ఏర్పాటు చేయడం అభినందనీయం.

: ముక్కు రాధాకృష్ణ, నెల్లూరు

దోమల నివారణతో మలేరియా దూరం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

కొడవలూరు: దోమల నివారణతో మలేరియాను దూరం చేయవచ్చని కొడవలూరు వైద్యాధికారి ఎం రామకృష్ణ పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా కొడవలూరులో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటుతో మలేరియా, డెంగీ, బోదకాలు వంటి వ్యాధులు సోకుతాయని వివరించారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చన్నారు. రాత్రి వేళల్లో దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు వినియోగించడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సోమశేఖర్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తుకూరులో ఓ మోస్తరు వర్షం



ముత్తుకూరు: మండలంలో బుధవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. మేఘాలు దట్టంగా అలుముకుని ఉరుములు, మెరుపులతో కొద్దిసేపు వర్షం కురిసింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు వర్షానికి కాస్త ఊరట పొందారు.